



మానుకోట శివారు హస్తినాపురం కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 11వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో శనివారం పర్యటించారు. ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, వీధి లైట్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యంకు సంబంధించి మునిసిపల్ అధికారులతో చర్చించారు. సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను సందర్శించి వంట గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతుకృషి చేస్తానని చెప్పారు. ఎక్కడ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే.. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. మానుకోట మునిసిపల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిదులు కేటాయించిందని వాటితో పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుందామ న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా, గుగులోతు వెంకట్‌నాయక్, చెన్నూరి విజయలక్ష్మి, ఎడ్ల రమేష్, రామగోని రాజు, శ్యామ్, నజీర్, నిమ్మల శ్రీను, భూక్య లక్ష్మి, పోతురాజు రాజు, సల్వాది దిలీప్, యాదగిరి, వాసుదేవ్, వంగ వెంకటరమణ, శేఖర్, నవీన్, ప్రభాకర్, సాగర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ సబ్‌జైలును సందర్శిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సబ్‌జైల్‌ను సందర్శించి జైల్లో ఉన్న వివిధ బ్యారక్‌లను తిరిగి ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాల గురించి సబ్‌జైల్ సూపరిండెంట్ మల్లెల శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి జైలు జీవితాన్ని భవిష్యత్‌కు సోపానంగా మార్చుకోవాలని, భవిష్యత్‌లో ఇదే చివరి జైలు జీవితం కావాలని ఖైదీలకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జైలర్ సదానిరంజన్, అదనపు డిప్యూటీ జైలర్ ఖాజాఖలీలుద్దీన్, బిక్షపతి, కుమార్ పాల్గొన్నారు.

- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న బాలికల సేవా సదనాన్ని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శాలినిషా కెల్లి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ అందరూ ఎళ్లవేళల అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



బోనస్ పైసలు వేయాలి..

- మునిగేటి మల్లయ్య, రైతు, ఉగ్గంపల్లి, చిన్నగూడూరు

ఉగ్గంపల్లిలో తనకున్న నాలుగెకరాలలో వరిలో సన్నరకం ధాన్యం సాగు చేశాను. 142 బస్తాల దిగుమతి వచ్చింది. ఈ బస్తాలను ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్నాను. ఇప్పటి వరకు నాకు రూ.500 చొప్పున బోనస్ రాలేదు. ప్రభుత్వం స్పందించి బోనస్‌ను వెంటనే విడుదల చేయాలి.

హలధారి అరిగోస



మహబూబాబాద్ మండలం ముడుపుగల్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి అమ్మకానికి వచ్చిన ధాన్యం రాశులు (ఫైల్)

వడ్ల పైసలు రాలె..! 'బోనసు' పడలె!!

- రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు
- రైతుల ఖాతాల్లో జమైనవి రూ.411.69 కోట్లు
- రూ.66.17 కోట్లు బోనస్ బకాయిలు
- జిల్లాలో ఎరుచూస్తున్న అన్నదాతలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గత యాసంగిలో సన్నవడ్ల బోనస్ ఇప్పటికి రైతులకు నయా పైసారాలే.. వడ్లు అమ్మిన కొందరికి అసలు నగదు రాలే? ఇది మహబూబాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి. ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్ల జరిగాయి. మే 31 వరకు ధాన్యం కొనుగోళ్ల పూర్తయిన ఇంకా వెయ్యి మందికి పైగా రైతులకు అసలు వడ్ల పైసలు అందలే. రైతుభరోసాపై దృష్టిసారించి విజయవంతంగా పూర్తి చేసి రైతుల మన్ననలు పొందిన రాష్ట్ర ప్రభుత్వం వడ్ల బోనస్‌పై దృష్టిసారించకపోవడంతో బోనస్ కూడ పెండింగ్‌లో పడిపోయింది. వడ్ల పైసలు కొంత మందికి పడి సంతోషపడుతుండగా మరికొందరికి అసలే రాకుండా ఆలస్యమవుతుండడంతో పరేషాన్‌కు గురవుతున్నారు. 31వేల మందికిపైగా రైతులకు ఇస్తామన్న రూ.500 బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు.

యాసంగి ఖరీదులు ఇలా..

గత యాసంగిలో జిల్లాలో 239 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 37,518 మంది రైతుల నుంచి 17,7491 మెట్రిక్ టన్నుల ధాన్యం రూ.411.69 కోట్లు ఖరీదు చేశారు. ఇది రికార్డుస్థాయిలో కొనుగోలు చేశారని చెప్పక తప్పదు. ఈ నెల 27 వరకు అందులో 36,895 మంది రైతులకు చెందిన 1,73,574 మెట్రిక్ టన్నులు రూ.402.58కోట్లు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆన్‌లైన్ చేసిన వాటిలో 35,855 మంది రైతులకు చెందిన 1,69,152 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.392.32 కోట్లు (97.45 శాతం) రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఇంకా 1040 మంది రైతులకు రూ.10.26 కోట్లు అసలు వడ్ల పైసలు చెల్లించాల్సిఉంది. కాగా, 623 మంది రైతుల వివరాలను 'ఆన్‌లైన్'లో నమోదు చేయలేదు. భారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకురావడంతో అధికారులు వాటిని ఖరీదు చేసి ఆమోదం కోసం రాష్ట్ర అధికారుల అనుమతి కోసం లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల అనుమతి వస్తేనే మిగిలిన రైతుల ఖాతాల్లోకి అసలు పైసలు జమ అవుతాయి. ఉన్నతాధికారుల అనుమతి కోసం జిల్లా అధికారులు ఎదురు చూస్తున్నారు.

అదనపు కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు, సివిల్ సప్లై అధికారులు కలిసి జిల్లాలో భారీగా వచ్చిన ధాన్యాన్నిచివరిగింజ వరకు కూడ ఖరీదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చివరి గింజ వరకు ఖరీదులు చేయాలన్న ఆదేశాల మేరకు ఈ ఖరీదులు జరిగాయి.

ఒక్కరైతుకూ రాని బోనస్..

మహబూబాబాద్ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో ఏ ఒక్క రైతుకు బోనస్ పైసలు రాలె. 1,32,344 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లా సివిల్ సప్లయీస్ అధికారులు 'ఆన్‌లైన్'లో నమోదు చేశారు. వారికి ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్ 31,500 మంది రైతులకు చెందిన రూ.66.17 కోట్లు జమ కావాల్సి ఉంది. అంతేకాకుండా ఇంకా నమోదు కానీ రైతుల వివరాలు కొన్ని ఉన్నాయి. రైతుభరోసా పెట్టుబడిపైనే దృష్టి సారించి వారిని ఆదుకున్న ప్రభుత్వం బోనస్ విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు బోనస్ రాని రైతులు విమర్శిస్తున్నారు. అలాగే అసలు వడ్లు అమ్మిన కొంతమంది రైతులు డబ్బుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

ఇంటికి పిలిపించి.. మద్యం తాగించి...

- కాజీపేటలో వడ్డీ వ్యాపారి దారుణ హత్య
- నిందితుడు గడ్డం ప్రవీణ్‌కుమార్ రైల్వే ఉద్యోగి
- తీసుకున్న అప్పును తీర్చాలన్నందుకు పక్కా ప్లాన్‌తో దాడి
- మృతుడి ఒంటిపై వున్న బంగారు వస్తువులు తీసుకొని పరారీ
- నిందితుడిది మొదటి నుంచి నేరప్రవృత్తే...



నవీన్‌కుమార్ (ఫైల్)

కాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వడ్డీకి ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమన్నాడన్న కోపంతో ఓ వడ్డీ వ్యాపారిని హనుమకొండ జిల్లా కాజీపేటలో ఓ రైల్వే ఉద్యోగి కత్తితో పొడిచి చంపాడు. అనంతరం శవంపై వున్న బంగారు వస్తువులను తీసుకొని ఉడాయించాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన ఇలా ఉన్నాయి.. వరంగల్ గిర్మాజిపేటకు చెందిన త్రిపురాది నవీన్‌కుమార్ (55) ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. గత కొన్ని సంవత్సరాలుగా కాజీపేటలోని పలువురు వ్యాపారస్తులకు, రైల్వే ఉద్యోగులకు వడ్డీకి అప్పులు ఇస్తున్నాడు. ఈ క్రమంలో కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో ఉండే రైల్వే (మిగతా 8వ పేజీలో)



ప్రగతినగర్‌లో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

శివారు కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రం శివార్లలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 4వ వార్డు పరిధి ప్రగతినగర్‌ను శనివారం సందర్శించారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రగతి నగర్‌లో అనేక ఏళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని కాలనీలో సరియైన మౌళిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అక్కడ రోడ్డు, విద్యుత్, ఇంటి నెంబర్ల సమ స్య ఉందని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, డివిజన్ కార్యదర్శి హలావత్ లిం గన్న, సామ పాపయ్య పాల్గొన్నారు.

బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి

- జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లను పెంచాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి, నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువుపై దృష్టి సారించి ప్రత్యేకమైన బోధనా పద్ధతులను అవలంబించి, విద్య నేర్పాలని సూచించారు. ఎందులోనైతే విద్యార్థులు వెనుకబడి ఉంటారో ఆ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు ప్రతీ రోజు ఒక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించాలని సూచించారు. టైం టేబుల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. వరుసగా గైర్హాజరవుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, వారు పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సక్రమంగా విధులకు హాజరు కాని ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనం వేడిగా, పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని, అందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ, డీఈవో రవీందర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్, అప్పారావు, శ్రీరాములు, విజయనిర్మల పాల్గొన్నారు.

మానుకోట, కురవి మండలాల్లో తనిఖీలు..

మహబూబాబాద్, కురవి మండలాల్లో కలెక్టర్ అద్వైత్ కుమార్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మహబూబాబాద్ మం డలం సంగ్రాలగూడెంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. కురవిలో జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన వారికి ఇందిర మ్మ ఇళ్లు మంజూరు చేసి వాటి నిర్మాణానికి పకడ్బందీ చర్యలు తీసుకుని ముందుకు సాగుతుందని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా అడ్మిషన్లు కల్పించామని పేర్కొన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు ప్రతీ ఒక్కరి ఆరోగ్య పరిస్థితులపై రికార్డులు మెయింటెన్ చేస్తూ వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మానుకోట ఎంపీడీవో రఘుపతిరెడ్డి, కురవి తహసీల్దార్ బి. విజయ పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌తో సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి

8

లిక్కర్ స్కాం నుంచి బయటపడేందుకే కవిత ఆరోపణలు : టీడీపీ

నెహ్రూసెంటర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లి వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారని టీడీపీ మహబూబాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్ల నది జలాలపై చంద్రబాబును విమర్శించడం సరికాదన్నారు. లిక్కర్ దందాలో అరెస్టై తిహార్ జైల్లో ఉండి వచ్చిన కవిత ఆమెపై వచ్చిన వ్యతిరేకతను కప్పి పుచ్చుకోవడానికి ఇది ఒక నాటకమన్నారు. ఈ సమావేశంలో ప్రేమ్‌చంద్‌వ్యాస్, సుతారపు వెంకటనారాయణ పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని గుడిసెకు నిప్పు

- వృద్ధురాలి ఇంటిని దహనం చేసిన సమీప బంధువు
- ఏటూరునాగారంలో ఘటన



కాలిపోయిన పూరి గుడిసె వద్ద రోదిస్తున్న బాధితురాలు సమ్మక్క

ఏటూరునాగారం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఓ వృద్ధురాలి పూరి గుడిసెను సమీప బంధువు దహనం చేసిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురానికి చెందిన పలక సమ్మక్క నిరుపేద వృద్ధురాలు. ఓ పూరి గుడిసెలో ఆమె ఒంటరిగా జీవిస్తోంది. శనివారం ఆమె సమీప బంధువు పలక నాగరాజు అక్కడికి వచ్చి మద్యం తాగడానికి డబ్బులు కావాలని అడిగాడు. తన దగ్గర లేవని సమ్మక్క చెప్పడంతో పింఛను వచ్చింది కదా.. ఆ డబ్బులైనా ఇవ్వు అని అతడు ఒత్తిడి చేశాడు. తనకు ఇంకా పింఛను రాలేదని, డబ్బులు లేవని సమ్మక్క చెప్పడంతో నాగరాజు అక్కడి నుంచి వెళ్లి పోయినట్టే వెళ్లి పక్కనే దాక్కొని ఆమె గుడిసెకు నిప్పంటించాడు. గుడిసెలో ఒక్కసారిగా మంటలు రావడంతో ఆ వృద్ధురాలు హుటాహుటినా బయటకు వచ్చింది. ఇరుగుపొరుగు వారి సహాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఇంట్లోని సామాన్లన్నీ దగ్ధమయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇటీవలే ఆ వద్ధురాలి ఇంట్లో విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో మండల కేంద్రంలోని బ్లడ్ డోనర్స్ సంస్థ ఆధ్వర్యంలో దాతలు విద్యుత్తు సౌకర్యంతోపాటు బియ్యం, నిత్యావసర సరుకులను ఆమెకు అందించారు. ఇంటితో పాటు వస్తువులన్నీ కాలిపోవడంతో నిలువ నీడ లేని పరిస్థితి సమ్మక్కకు ఎదురైంది. వస్తువులన్నీ కాలిపోయాయని, ఉండడానికి గూడు కూడా లేకుండా పోయిందని ఆమె కన్నీరుమున్నీరవుతోంది.



కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనులను అడ్డుకున్న బాధితులు

రోడ్డు విస్తరణ పనులను అడ్డుకున్న బాధితులు

వెనుకకు వెళ్లిన ఎక్స్‌కవేటర్ యంత్రం

8

కీలక పదవిలో పీవీ నారాయణరావు

● తెలుగు రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక



వరంగల్ చౌరస్తా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావు ఎన్నికయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ట్యాక్స్ కన్సల్టెంట్లకు సేవలను అందిస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్‌బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో 54వ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కోటా అమిత్‌కుమార్ తెలిపారు. ఆయన ఈ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు. ప్రభుత్వ అధికారుల సమన్వయంతో ప్రజల్లో పన్నులపై అవగాహన కల్పిస్తున్న నారాయణరావును తెలుగు రాష్ట్రాలకు చెందిన సీఏలు అభినందించారు.

పీవీ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించాలి

● పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు



వంగర గ్రామంలో పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీవీ కుటుంబ సభ్యులు, తదితరులు

భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా వంగరతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు విజ్ఞప్తి చేశారు. శనివారం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో పీవీ 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలోని పీవీ విగ్రహానికి, ఇంట్లో పీవీ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రిగా ఆశ్రమ పాఠశాలలు, ముఖ్యమంత్రిగా భూ సంస్కరణలు, కేంద్ర మంత్రిగా నవోదయ పాఠశాలలు, ప్రధాన మంత్రిగా ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశ దశదిశను మార్చారని కొనియాడారు. తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ పీవీ పాలన అనంతరం కొనసాగుతున్న ప్రభుత్వాలు ఆయన చూపిన బాటలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. సాఫ్ట్‌వేర్ రంగం పీవీ చొరవనేనన్నారు. నేటి తరం యువత, ప్రజలు, పీవీ జీవిత పాఠాన్ని జీవనంలో ఒక భాగంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామోజు మొండయ్య, చిట్టంపల్లి అయిలయ్య, ఊసకోయిల ప్రకాష్, ఆర్.వెంకట్‌రెడ్డి, చిదురాల స్వరూప, ఒల్లాల రమేష్, తిరుపతిరెడ్డి, సతీష్‌రెడ్డి, గజ్జెల రమేష్, చంద్రారెడ్డి, లక్ష్మీకాంతారావు, కండెసుధాకర్, గోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు మాచర్ల కుమార్, ఊసకోయిల కిషన్, నోముల భిక్షపతి, బొల్లంపల్లి శ్యామ్, శనిగరపు అయిలయ్య, అయిత సాయి, గాజుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

» రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సర్వే సంగీత



హనుమకొండలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సర్వే సంగీత

వరంగల్ మెడికల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంబంధిత ప్రభుత్వవిభాగాలతో సమన్వయంతో పనిచేస్తూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సర్వే సంగీత సూచించారు. శనివారం హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాల వారీగా నమోదవుతున్న మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల వివరాలను సమీక్షించారు. ఎంజీఎంఆస్పత్రిలో నమోదవుతున్న మలేరియా, డెంగీ పాజిటివ్ కేసల వివరాలను ప్రతీ రోజు 6 గంటలలోపు సంబంధిత జిల్లాల డీఎంహెచ్‌వోలకు అందించాలన్నారు. అలాగే జిల్లాలోని అన్ని సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో హెచ్‌ఎంలతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి అందులో సీజనల్ వ్యాధులు ముఖ్యంగా చేతుల శుభ్రత, ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసే విధానం, జ్వరాలు, డయేరియాకు సంబంధించిన ప్రమాదకరమైన లక్షణాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు.

సామాజిక మాధ్యమాలలో ఈ కార్యక్రమాల గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా వ్యాధులకు సంబంధించిన సమాచారాన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన ప్రదేశాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతీ మంగళవారం ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మరింత పటిష్ఠంగా నిర్వహించాలని ఆశాలకు, ఏఎన్ఎంలకు సూచించారు. ఉమ్మడివరంగల్ జిల్లాలో బాలికల లింగ నిష్పత్తి చాలా తక్కువగా ఉందని, డీఎంహెచ్‌లో బాధ్యత తీసుకొని తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, మహబూబాబాద్ డీఎంహెచ్‌వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ రవి రాథోడ్, భూపాలపల్లి జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక



నర్సంపేటలోని వైద్య కళాశాలలో సమీక్షలో మాట్లాడుతున్న సంగీత

నర్సంపేట : ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలో ఎన్ఎంసీ నిబంధనల మేరకు సౌకర్యాల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సర్వే సంగీతసత్యనారాయణ అన్నారు. నర్సంపేటలోని ప్రభుత్వ వైద్యశాల, వైద్య కళాశాలను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ సత్యశారదతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద, ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, వివిధ విభాగాధిపతులు, అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఆస్పత్రి వసతుల కల్పనకు కావలసిన అంశాలపై కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మెడికల్ కళాశాలలో బోధన, బోధనేతర, ల్యాబ్ సిబ్బందికి కావాల్సిన వసతులపై సమీక్షించారు. వైద్య విద్యార్థుల వసతి గృహాన్ని సందర్శించి వాటిగురించి వివరాలను ప్రిన్సిపాల్ మోహన్‌లాల్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీఎంసీ నర్సంపేటలో ఉన్న ఆస్పత్రిలోని పలు విభాగాలను కలెక్టర్, వైద్యాధికారులతో కమిషనర్ సందర్శించి అక్కడున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వనరుల కొరత, యూజీ మెడికల్ ఎడ్యుకేషన్, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ఉండాల్సిన సౌకర్యాల గురించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు కమిషనర్ సంగీత సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు డాక్టర్ సాంబశివరావు, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీదేవి, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : జడ్జి



మాట్లాడుతున్న జిల్లా మెజిస్ట్రేట్ మరికల్

రాయపర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సీడ్ కంపెనీలు, ఫర్టిలైజర్ షాపులు నాణ్యత లేని, కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా మెజిస్ట్రేట్ మరికల్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో రైతులకు, విత్తన డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన ఎంపిక, కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సీల్డ్ ప్యాకెట్‌లో ఉన్న విత్తనాలనే కొనుగోలు చేయాలని, విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆధీకృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ రజిని, సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో వీరభద్రం, రైతులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన రోజే
ఉద్యోగ విరమణ



ఏసీపీ నర్సయ్యకు పూలమొక్క అందిస్తున్న శ్రీనివాస్

వర్ధన్నపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సున్నాయిల శ్రీనివాస్‌కు శనివారం ఎస్సైగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన శ్రీనివాస్ సోమవారం రోజున ఉద్యోగ విరమణ చేయడం గమనార్హం. పదోన్నతి పొందిన శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్యను కలిసి పూలమొక్క అందజేశారు. శ్రీనివాస్‌ను ఏసీపీ అంబటి నర్సయ్య అభినందించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎఫ్‌డీవో ద్వాలియ

దుసపాటిలొద్ది జలపాతం సందర్శనకు నో పర్మిషన్

వాజేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వాజేడు మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో ఉన్న దుసపాటిలొద్ది జలపాతం సందర్శనకు అనుమతి లేదని వెంకటాపురం ఎఫ్‌డీవో ద్వాలియ అన్నారు. శనివారం బొగత జలపాతాన్ని సందర్శించిన అనంతరం దుసపాటిలొద్ది జలపాతానికి వెళ్లే కొంగాల మార్గంలో ఏర్పాటు చేసిన ఫారెస్టు చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. దుసపాటిలొద్ది జలపాతానికి పర్యాటకులు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని సూచించారు. జలపాతం వద్ద ఎటువంటి రక్షణచర్యలు లేవనితెలిపారు. శని, ఆదివారాలతో పాటు మిగతా రోజుల్లో కూడా సిబ్బంది చెక్‌పోస్టువద్ద విధులునిర్వర్తించాలని సూచించారు.

ఆభరణాల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ సీఐ సురేందర్

గిర్మాజిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బంగ్లాతండాకు చెందిన ఇస్లావత్ సురేష్ నగరంలో కూలిపనులు చేస్తున్నాడు. జల్సాల కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో శనివారం జీఆర్‌పిసిబ్బంది రాము, రియాజుద్దీన్, నాగరాజు, ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఎన్.రమేష్ ప్లాట్‌ఫాంపై తనిఖీ చేస్తుండగా సురేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 28.645 గ్రాముల బంగారు ఆభరణాలు లభించాయి. దాంతో పాటు తను నేరాలు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి పోలీసులు బంగారు చైన్, 2 పుస్తెలు, 3 జతల చెవి కమ్మలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వీటి విలువ రూ.2.86 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

గాజర్ల రవి ఆశయాలు సాధించుకుందాం

● నినదించిన రాజకీయ, పౌర సంఘాల నేతలు, ప్రజలు
● వెలిశాలలో సంస్మరణ సభ
● భారీగా తరలివచ్చిన జనం
● నివాళులర్పించిన ప్రముఖులు



సంస్మరణ సభలో విప్లవ గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

టేకుమట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గాజర్ల రవి ఆశయ సాధనకు కృషి చేద్దామని పలువురు రాజకీయ నేతలు, పౌరసంఘాల నాయకులు, ప్రజలు నినదించారు. బడుగు బలహీన వర్గాలకోసం ప్రాణాలు అర్పించిన రవి జీవితం ఆదర్శమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడిమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మవోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ సంస్మరణ సభ ఆయన స్వగ్రామం భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలలో శనివారం జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ, పౌర హక్కుల నాయకులు హాజరయ్యారు. గాజర్ల రవి చిత్రపటానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన సంస్మరణ సభ రోజంతా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు ఆటపాటలతో సంస్మరణ సభ హోరెత్తింది. టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల నుంచి ప్రజలు, గాజర్ల రవి అభిమానులు, మాజీ మావోయిస్టులు, సానుభూతిపరులు పాల్గొని నివాళులర్పించారు. గాజర్ల రవి ఆశయ సాధన కోసం పాటుపడాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. రవి సోదరుడు గాజర్ల అశోక్ మాట్లాడుతూ పేదలకు ఎప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. తన అన్న ఆశయ సాధనకు నిరంతరం పాటుపడతామన్నారు.పేదల కష్టాల్లో పాలుపంచుకొనేందుకు కృషి చేస్తామన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి : గాదె ఇన్నయ్య

మాజీ మావోయిస్టు, భారత్ బచావో జాతీయ నాయకుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ మావోయిస్టు అగ్ర నాయకుడు గాజర్ల రవి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లతో కేంద్రం మావోయిస్టులను పట్టుకొని కాల్చివేస్తోందని దుయ్యబటారు.

నివాళులు అర్పించిన వారిలో..

గాజర్ల రవి సంస్మరణ సభకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ, శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్‌రెడ్డి, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యురాలు పద్మిని కుమారి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దొమ్మాటి సాంబయ్య తదితరులుహాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ పాటలతో గాజర్ల రవికి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి

డోర్నకల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి చెందిన సంఘటన శనివారం డోర్నకల్‌లోని సబ్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. బాధిత రైతు అష్రఫ్ బేగం తెలిపిన ప్రకారం... శనివారం ఉదయం తాను కౌలుకు తీసుకున్న వ్యవసాయ భూమిలో గేదెలను మేతకోసం వదిలినట్లు చెప్పారు. గేదెలు మేత మేస్తూ అప్పటికే కిందపడి ఉన్న విద్యుత్ వైర్లను తాకగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ అధికారులకు తీగలు తెగిపడిన విషయం చెప్పినప్పటికి పట్టించుకోవడం లేదని, వారి నిర్లక్ష్యం మూలంగానే గేదెలు మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కర్ణాటకలో డోర్నకల్ యువకుడి అనుమానాస్పద మృతి



రవికుమార్ (ఫైల్)

డోర్నకల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని బంకట్‌సింగ్‌తండాకు చెందిన జాటోతు రవికుమార్(25) అనే యువకుడు కర్ణాటక రాష్ట్రం బెలగాంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెలగాంలో సెంట్రల్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి తాను అద్దెకు ఉంటున్న ఇంటిలో నిద్రకు ఉపక్రమించాడు. గురువారం ఉదయం బ్యాంక్‌లో పనిచేసే తోటి ఉద్యోగులు అతడికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో వారు ఇంటి యాజమానికి విషయం చెప్పారు. ఇంటి యాజమాని అతడి గది వద్దకు వచ్చి చూడగా లోపల గడియ పెట్టి ఉండడంతో తలుపులు తెరిచి చూడగా మంచంపై రవికుమార్ విగతజీవిగా కనిపించాడు. వెంటనే బ్యాంక్ సిబ్బందికి, రవికుమార్ కుటుంబసభ్యులకు, కర్ణాటక పోలీసులకు సమాచారం అందించాడు. అనంతరం కుటుంబసభ్యులు అక్కడికి చేరుకోగా రవికుమార్ మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆపై కుటుంబసభ్యులు రవికుమార్ మృతదేహాన్ని బంకట్‌సింగ్ తండాకు తీసుకురావడంతో బంధువులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం రవికుమార్ అంతిమయాత్ర నిర్వహించి వారి వ్యవసాయ క్షేత్రంలో ఖననం చేశారు. రవికుమార్ తండ్రి దేవరాజ్ సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సైగా పనిచేస్తున్నారు. మృతుడికి తల్లి, సోదరుడు, సోదరి ఉన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

తొర్రూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8వ తేదీన తొర్రూరు నుంచి కాణిపాకం, సిరిపురం మీదుగా అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికుల అవసరాలను బట్టి ఆర్టీసీ వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతుందని, అరుణాచలం వెళ్లే ప్రయాణికులకు 8న మధ్యాహ్నం తొర్రూరు నుంచి బస్సు బయలుదేరుతుందని, అరుణాచలంతోపాటు వివిధ పుణ్యక్షేత్రాల దర్శనం అనంతరం తొర్రూరుకు చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.5,100, పిల్లలకు రూ.4,100 నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 9959226053, 8074474984 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతా..

● నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి రేఖఅనిల్

నర్సింహులపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):తాను ఇకపై కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, పార్టీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని డోర్నకల్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి రేఖఅనిల్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను 10 ఏళ్ల నుంచి పార్టీకి వెన్నెముక లాగా పని చేశానని, కొన్ని అనివార్య కారణల వల్ల పార్టీని వీడాలనుకున్నానని, కానీ పార్టీపై తనకుఎనలేని విశ్వాసం ఉందని, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సారథ్యంలో ముందుకు నడుస్తానని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జినుకల రమేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కడుదుల రామకృష్ణ, గౌని యాదగిరి, ఏరనాగి రమేశ్, ఏరనాగి వెంకన్న, చిర్ర సతీష్, మంచినీళ్ల రఘు, దోమల యాదగిరి, చల్ల మధు, వెంకటేష్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.



మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ ఛైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి ఛైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్ల ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్ పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోపముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్లు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర న్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.



పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

తప్పు చేస్తేనే భయపడాలి

- జైలుకు వెళ్తే పొలిటికల్ కింగ్‌లా ఉండాలి
- వర్ధన్నపేట ఎమ్మెల్యేపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- రేవంత్‌రెడ్డి నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్షంలో ఉన్న మనల్ని బెదిరిస్తారు.. కేసులు పెడతామని వేధిస్తారు.. తప్పు చేస్తేనే బయపడాలి, జైలుకు వెళ్తే పొలిటికల్ కింగ్‌లా ఉండాలంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం వరంగల్‌లోని నాని గార్డెన్స్‌లో నిర్వహించిన వర్ధన్నపేట బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యేపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, మూడు సర్వే రిపోర్టులు మనకు అనుకూలంగా వచ్చాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులను తీసుకుందామని, పార్టీని పటిష్ఠం చేయడం కోసం రెండు నెలలు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీలో పనిచేసే వాళ్లకు కచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఇప్పటికిప్పుడు తెలంగాణలో ఎమ్మెల్యే ఎన్నికలు పెడితే బీఆర్ఎస్‌కు 100 సీట్లు వస్తాయన్నారు.

రేవంత్ రెడ్డి ఒక మూర్ఖుడని, నోరు తెరిస్తే అన్ని అబద్ధాలే చెబుతారని, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేకపోతున్నాడని ఆరోపించారు. ఇప్పుడు కొన్ని చోట్ల నిధులు, డబ్బులు అందిస్తున్నాడని ఎన్నికలు వస్తున్నాయనే కాంగ్రెస్ కుటిల రాజకీయాలు చేస్తోందన్నారు. వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున సీఎం రేవంత్‌రెడ్డికి డబ్బులు ముడుతున్నట్లు సమాచారం ఉందని ఆరోపించారు. సంవత్సర కాలంగా రాహుల్ గాంధీ రేవంత్‌రెడ్డికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు.

ఎమ్మెల్యే, మంత్రులు సీఎం మాట వినడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ ఎప్పుడు కుప్పకూలుతుందో తెలియదంటూ జోస్యం చెప్పారు. ఉద్యమకారులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, సోషల్ మీడియా విధానాన్ని సైతం ప్రోత్సహిస్తూ ఉత్సాహంగా పనిచేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, చింతల యాదగిరి, మాజీ ఎంపీపీ అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరంగల్ నాని గార్డెన్స్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కుల్లా, నిత్యక్లిన్న అలంకరణలో భద్రకాళి

మూడో రోజుకు చేరిన శాకంబరీ ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చరిత్ర ప్రసిద్ధి గాంచిన వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం 4 గంటలకు నిత్య పూజ, నిత్యాహ్నిక హోమం జరిపించారు. అమ్మవారి దశ మహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి కుల్లా, నిత్యక్లిన్న అలంకరణ చేసి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. అమ్మవారి అలంకరణ గురించి అర్చకుడు భద్రకాళి శేషు వివరిస్తూ.. నారాయణుడు వరహమూర్తి రూపంలో రాక్షసుల బారి నుంచి భూమండలాన్ని కాపాడారని, ఆ వారాహి శక్తే ఈ కుల్లా మాత అని, ఈ తల్లిని ఆరాధించిన వారికి శత్రుబాధ తొలగిపోతుందన్నారు. ఆ అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్నతో పాటు సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, శ్యాంసుందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఊరు ఒకటే.. పేర్లు రెండు

- రికార్డులో ఒకలా.. వాడుక భాషలో మరోలా
- లోకల్ పేర్లకే ప్రాధాన్యమిస్తున్న గ్రామీణులు
- చిత్ర విచిత్రంగా ధ్వనించే పదాలు

ఊరు ఒక్కటే.. కానీ పేర్లు మాత్రం రెండు ఉంటాయి.. ఆ రెండు పేర్లలో ఒకటేమో సర్కారు రికార్డులకు పరిమితం కాగా మరోపేరు మాత్రం తరతరాలుగా అక్కడి ప్రజల నాలుకలపై కదలాడుతుంటుంది. ఇలాంటి గ్రామాల వరుస జనగామ జిల్లాలోని ప్రతీ మండలంలో సర్వసాధారణమే.. అయితే రికార్డులోని పేరుతో కాకుండా వాడుక భాషలో పిలిచే పక్కా లోకల్ పేర్లకే స్థానికంగా ప్రాధాన్యమిస్తున్న దానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

లింగాలఘణపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న రఘునాథపల్లి మండల కేంద్రం ఎన్నో ఏళ్లుగా రగంతపల్లెగా వాడుక భాషలో కొనసాగుతోంది. ప్రభుత్వ రికార్డుల్లోనే కాకుండా రైల్వే రికార్డుల్లో సైతం రఘునాథపల్లిగా ప్రభుత్వ గెజిట్ ముద్రితమై అన్ని అధికార పత్రాల్లో కొనసాగుతోంది. కానీ వందలాది ఏళ్ల నుంచి పాతతరం వ్యక్తులకు రగంతపల్లెగానే సుపరిచితం. చుట్టుపక్కల గ్రామాల వారు బస్సెక్కేందుకు బస్టాండ్ వద్దకు వచ్చి నిలబడినప్పుడు మరో పరిచయస్తుడు కలిసి ఎటు వెళ్తన్నావు అని అడిగితే చటుక్కున రగంతపల్లెకు పోతున్నాను అని బదులివ్వడం ఇక్కడ సర్వసాధారణం.



ఇబ్రహీంపురం గ్రామ స్వాగత తోరణం

ఇబ్రహీంపురం.. ఇగురాంపురం

రఘునాథపల్లి మండలంలోనే మరో గ్రామం ఇబ్రహీంపురం.. ఈ గ్రామాన్ని ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పేరుతో కాకుండా 90శాతం మంది ప్రజలు ఇగురాంపురం గ్రామంగా పిలుచుకుంటారు. ఫతేషాపూర్, ఇబ్రహీంపురం గ్రామాలు రెండు పక్కపక్కనే ఉంటాయి. కానీ ఈ రెండు గ్రామాల పేర్లు రికార్డుల్లో ఒక రకంగా ఉండగా స్థానికంగా వ్యవహార బాషలో పేర్లను మార్చుకుని పిలుచుకునే ఆనవాయితీ ఇక్కడ తరతరాలుగా వస్తుండటం గమనార్హం. అదేవిధంగా రఘునాథపల్లి మండలంలోని మరో గ్రామ పంచాయతీ శ్రీమన్నారాయణపురం గ్రామాన్ని స్థానికులు అత్యధికంగా నానపురం గ్రామంగా సంబోధిస్తారు. వాస్తవానికి ఎక్కువశాతం ప్రజలు రికార్డుల్లో ఉన్న పేరుకంటే వ్యవహార బాషలో సాధారణమైంది. నేటి తరం యువతలో మాత్రం ఇప్పుడిప్పుడే కాస్త మార్పు వస్తూ శ్రీమన్నారాయణపురంగా వాడుతున్నారు.

ఫతేషాపూర్.. పచ్చాపురం..

రఘునాథపల్లి మండలంలోని ఫతేషాపూర్ గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వ దస్త్రాల్లో ఫతేషాపూర్‌గా ఉంటుంది. కాగా అక్కడి స్థానికులు మాత్రం కొత్త వ్యక్తులు కలిసినప్పుడు మీది ఏఊరు అని అడిగితే మాది పచ్చాపురం అని చెబుతారు. ఇదేంటి గ్రామంలోని బోర్డుపై ఫతేషాపూర్ అని ఉంది కదా అని అంటే మేము గిట్లనే పిల్చుకుంటాం.. అని సమాధానమిస్తారు.

గుమ్మడవెల్లి.. గూడెల్లి

లింగాలఘణపురం మండలం గుమ్మడవెల్లి గ్రామపంచాయతీని చాలామంది ప్రజలు అసలు పేరుతో కాకుండా మా ఊరు గూడెల్లి అంటూ పక్కా లోకల్ పేరుతోనే ఎక్కువగా పిలుస్తుంటారు. గుమ్మడవెల్లి అనే పేరును వాడే వారి సంఖ్య చాలా అరుదు. అదేవిధంగా ఇదే మండలంలోని నేలపోగుల గ్రామాన్ని స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు నాలపోల అని పిల్చుకుంటారు. ఒగ్గు కళాకారుల పుట్టిల్లు మాణిక్యాపురం గ్రామపంచాయతీని చాలా మంది మాన్కపురంగా ప్రజల నాలుకలపై నానుతుంటుంది.



పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామ బోర్డు

ఈరవెన్ను.. ఈరెంటిగా..

పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామాన్ని ఈరెంటి అని పలికితేనే అందరికీ సుపరిచితం.. ఈరవెన్ను గ్రామం ఎలా వెళ్లాలో కాస్త జాడచెప్పండి అని పాతతరాన్ని అడిగితే నోరెళ్లబెడుతారు.. ఈరవెన్నా.. అదెక్కడ అని ఉల్టా ప్రశ్నిస్తారు.. అదే పేరు మార్చి ఈరెంటి ఎక్కడో చెప్పండి అంటే వెంటనే చిరునామాను చెప్పేస్తారు. ఇదే మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామాన్ని స్థానికులతో పాటుగా పరిసర ప్రాంతాల వారు లచ్చినాపురం గ్రామంగా స్థానిక వ్యవహార భాషలో పిలుచుకుంటారు.

ఈరెంటిగానే సుపరిచితం..

మా ఊరుపేరు ఈరవెన్నుగా అన్ని ప్రభుత్వ రికార్డుల్లో ఉంటుంది. కానీ తరతరాలుగా వ్యవహార నామధేయంగా వాడుకలో ఉన్న ఈ రెంటిగా పిలుచుకోవడమే సంతృప్తిగా ఉంటుంది. ఈరవెన్ను అని కొత్త తరం వ్యక్తులే వాడుతుండగా 50ఏళ్ల వయసు పైబడ్డ వాళ్లంతా ఈరెంటి గ్రామంగానే చెప్పుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.



బిర్రు మాణిక్యం, ఈరవెన్ను

గూడెల్లి అంటేనే తెలుస్తుంది..

మా ఊరుకు గుమ్మడవెల్లిగా పేరు ఎలా వచ్చిందో తెలియదు కానీ పూర్వం నుంచి మే మంతా గూడెల్లిగానే పిలుచుకుంటాం.. ఇప్పటి తరం వ్యక్తులు గుమ్మడవెల్లిగా పిలుచుకుంటున్నా గూడెల్లి పిలుపులో ఉన్న మాధుర్యం మాత్రం దొరకదు.



లావు పాపిరెడ్డి, గుమ్మడవెల్లి

దేవరుప్పుల.. దారుప్పుల

జిల్లాలోని అనేక గ్రామాల వ్యవహార భాషలో వాడుకలో ఉన్న లోకల్ పేర్ల వరుసలో ఉన్న గ్రామాల్లో దేవరుప్పుల మండల కేంద్రం సైతం ఉంది. దేవరుప్పులగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నా వృద్ధులు, నిరక్షరాస్యులు, గిరిజనులు దారుప్పులగా పిలుచుకుంటారు. ఇదే మండలంలోని పడమటి తండాను పెద్దతండాగా వాడుకలో ఉంది. తరిగొప్పుల మండలంలోని నర్సాపూర్ గ్రామాన్ని రామరాజుపల్లిగా, నర్సింగాపూర్ గ్రామం కొడిశేరుపల్లిగా, మరియాపురం నూతన గ్రామపంచాయతీ అడ్డబాటగా వాడుకలో కొనసాగుతోంది. జఫర్‌గఢ్ మండలంలోని ఏబీ తండా (ఆళ్వార్‌బండ) తండాను శంకర్‌తండాగా, కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామాన్ని ఏనూతుల గా, లక్ష్మక్కపల్లి గ్రామాన్ని లసుమ్‌పల్లిగా జనగామ మం డలం శామీర్‌పేట గ్రామాన్ని శాన్‌పేటగా, పెద్దపహాడ్ గ్రామాన్ని పెద్దపాటిగా, చిల్పూర్ మండలంలోని వెంకటేశ్వరపల్లిని కొత్తపేటగా పిలుచుకోవడం ఇక్కడ స్థానికుల ఆనవాయితీగా వస్తుంటం గమనార్హం.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

'స్థానిక'ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో మాజీ సర్పంచులు, గ్రామపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ఎంపీటీసీలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని కూడ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని చెప్పారు. గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు తెగిపోయిన చెరువు కట్టలకు నేటికి మరమ్మతులు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు పర్సంటేజ్ ఇస్తేనే డబ్బులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ద్వారా సాగునీరు, తాగునీరు అందించి రైతులను ఆదుకున్న ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రతీ రోజు కేసీఆర్‌కుటుంబాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపుల లొల్లి నడుస్తోందన్నారు. తనపై ఎన్నికల సమయంలో అనేక ఆరోపణలు చేశారే తప్ప ఏ ఒక్కటి కూడా రుజువు చేయలేదని చెప్పారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, సుధగాని మురళి, ఎన్నారై బుచ్చిబాబు, లూనావత్ అశోక్‌నాయక్, నర్సింగ వెంకన్న, ఆవుల వెంకన్న, గంధం ఉప్పలయ్య, తప్పెట్ల వెంకన్న, షరీఫ్, దామునాయక్, ఎలేందర్, బాలునాయక్, ఇమామ్, నలమాస సాయి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగం శిక్షార్హం

● జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి

మహబూబాబాద్‌రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తుపదార్థాలకు అలవాటు పడుతూ.. తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, మత్తుపదార్థాల వినియోగం శిక్షార్హమని మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి అన్నారు. జిల్లాకేంద్రంలోని వికాస్ జూనియర్ కళాశాలలో శనివారం మత్తుపదార్థాల వాడకం, అనర్థాలు, జరిగే నష్టాలపై అవగాహనసదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు అలవాటు పడితే అనేక సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. దేశ భవిష్యత్‌ను కుంగదీసే మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం సరదాగా మొదలై వ్యసనంలా మారి చివరకు జీవితాన్ని సర్వనాశనం చేస్తాయని చెప్పారు. మద్యం, డ్రగ్స్ మత్తులో తీవ్రమైన నేరాలకు పాల్పడుతారని, మత్తు పదార్థాలు సేవించడం హానికరమని, చట్టరీత్యా నేరమని, వాటిని సేవించినట్లు రుజువైతే శిక్షార్హులవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి, న్యాయవాదులు దాసరి నాగేశ్వర్‌రావు, మోహన్, సురేష్, కళాశాల ప్రిన్సిపల్ బిక్కి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహబూబాబాద్ జిల్లా కోర్టు స్వాతిమురారి



మహాసభలో మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

స్పెషల్ డ్రైవ్‌తో సమస్యలను పరిష్కరించాలి

● సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రజాసమస్యలను పరిష్కరించాలని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ 18వవార్డు పరిధి శిఖారఖానగడ్డలో సీపీఐ శాఖ మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.మురుగనీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రేషపల్లి నవీన్, మంద శ్రీను, తరుణ్, ఉపేంద్ర, బాలాజీ, శ్రీను, అమరావవతి, సాయి, కవిత, విజయ, అనిల్, కిషోర్, సురేష్, ఉమేష్ పాల్గొన్నారు.

● మునిసిపల్ 9వ వార్డు పరిధి శనిగపురంలో సీపీఐ శాఖ మహాసభను చిట్టి మల్ల రాంచంద్రు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, మాలోతు రవీందర్, రాంచంద్రు, అబ్దుల్, వెంకన్న, వీరన్న, సైదులు, సారయ్య, వేణు, అశోక్, మురళీ, బ్రహ్మాచారి, యాకన్న పాల్గొన్నారు.

● మానుకోటని వెంకటమల్లు, మిల్త్రీకాలనీ, 551 కాలనీ శాఖ మహాసభలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, నాగెల్లి యాకమ్మ, బీమరాజు వెన్న, నవీన్, వెంకన్న, శ్రీకాంత్, నగరాజ్, అంజలి, పద్మ, మహేష్, స్వరూప పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను అడ్డుకున్న బాధితులు

కేసముద్రం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న యంత్రాన్ని ఇల్లు, దుకాణాలను కోల్పోయే బాధితులు అడ్డుకున్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చేందుకు రైతువేదిక వద్దకు భారీ సంఖ్యలో బాధితులు చేరుకున్నారు. దీంతో ఎమ్మెల్యే తన పర్యటనను రద్దు చేసుకున్నట్లు బాధితులు తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మహబూబాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. మానుకోటకు వెళుతున్న క్రమంలో అంబేడ్కర్ సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఎక్స్‌కవేటర్ యంత్రంతో రోడ్డుకు పక్కన తవ్వుతుండడంతో యంత్రాన్ని అడ్డుకున్నారు. తమకు ఎమ్మెల్యే మురళీనాయక్ ఇళ్లు, దుకాణాలకు నష్టం కలుగకుండానే రోడ్డు నిర్మిస్తామని గతంలో హామీ ఇచ్చారని బాధితులు యంత్రం నిర్వాహకులకు తెలిపారు. నోటీసులు ఇవ్వకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం ఏమిటని వాదనకు దిగారు. దీంతో పనులను నిలిపివేసి సదరు యంత్రాన్ని అక్కడి నుంచి తరలించారు.

కల్యాణలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

కేసముద్రం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైతువేదికలో శనివారం 50 మందికి కల్యాణలక్ష్మి, 13 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, 100 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను సొసైటీల చైర్మన్లు అల్లం నాగేశ్వర్‌రావు, అంబటి మహేందర్‌రెడ్డి, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ప్రసన్నరాణి, తహసీల్దార్ వివేక్, ఏఎంసీ డైరెక్టర్లు అయూబ్ ఖాన్, చింతకుంట్ల యాదగిరి పాల్గొన్నారు. అంతకుముందు రైతువేదిక ఎదుట దివంగత ప్రధాని పీ.వీ.నర్సింహారావు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ మాజీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మాజీ జడ్పీటీసీ కదిరె సురేందర్, పోలెపల్లి వెంకట్‌రెడ్డి, కనుకుల రాంబాబు, ఆంగోత్ బాల, బానోత్ వెంకన్న, భూక్య శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మురళీనాయక్ వస్తున్నారని తొలుత ప్రకటించి చివరి నిమిషంలో రద్దు కావడంతో స్థానిక నాయకులతో కొనసాగించారు.

తెలంగాణ అల్లుడికి ఆంధ్ర మర్యాదలు

● 118 రకాల రుచులతో విందు భోజనం

మహబూబాబాద్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అల్లుడికి ఆంధ్ర మర్యాదలు చేశారు. అత్తారింటికి కొత్తగా వచ్చిన అల్లుడికి ఆంధ్ర సాంప్రదాయ ప్రకారం 118 రుచులతో విందు భోజనం పెట్టారు. వివరాల్లోకి వెళితే.

తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సెవెన్‌హిల్స్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కాలనీ కోశాధికారి ఉప్పల శ్రీనివాస్-పద్మ దంపతుల కుమారుడు రోహిత్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పెద్దనందిపాడు వాసి భావనాసి శ్రీనివాసు- శైలజ దంపతులకు కుమార్తె విహారికతో 2023 మేలో వివాహం జరిగింది. పెళ్లి జరిగిన వెంటనే నూతన దంపతులు రోహిత్, విహారిక ఉద్యోగ రీత్యా అమెరికాలోని నార్త్ కరోలియా రాష్ట్రం చార్లెట్‌కు వెళ్లారు. రెండేళ్ల తర్వాత తొలిసారిగా కూతురు విహారిక అల్లుడు రోహిత్ పెద్దనందిపాడుకు అక్కడి సాంప్రదాయం ప్రకారం అల్లుడికి ఆంధ్ర మర్యాదలు చేశారు. 118 రకాల వంటల రుచులతో విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రాలో కొత్తగా ఇంటికి వచ్చిన అల్లుడికి ఇలా విందు భోజనం ఏర్పాటు చేయడం అక్కడ సంప్రదాయంగా వస్తోంది. తెలంగాణ అల్లుడికి జరిగిన మర్యాద చూడ ముచ్చటగా ఉంది. శనివారం పెద్ద నందిపాడులో భావనాసి శ్రీనివాస్, శైలజా దంతులు చుట్టుపక్కల వారిని పిలిచి విహారిక, రోహిత్ దంపతులకు 118 రకాల వంటకాలతో విందు భోజనం ఏర్పాటు వేడుక పండుగలా జరిగింది. ఈ కార్యక్రమంలో రోహిత్ తల్లిదండ్రులు ఉప్పల శ్రీనివాస్, పద్మ దంపతులు పాల్గొన్నారు.



పెద్దనందిపాడులో 118 రకాల విందు భోజనంతో దంపతులు ఉప్పల రోహిత్-విహారిక

గేదెను ఢీకొన్న బైక్

● ఓ యువకుడి మృతి

మరిపెడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బైక్ గేదెను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెంది, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని బుర్హాన్‌పురం సమీపంలోని పత్తి మిల్లు దగ్గర 365 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం బిక్కుమళ్ల గ్రామానికి చెందిన గజేంద్ర గణేశ్, భాల్ని గణేశ్, కుక్కల గణేశ్ బైక్‌పై మరిపెడబంగ్లాకు వస్తుండగా ఎన్‌హెచ్‌పై గేదె అడ్డురాగా దానికి ఢీకొట్టారు. ఈ సంఘటనలో గజేంద్ర గణేశ్(22) కొన ఊపిరి ఉండగా ఆటోలో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. భాల్ని గణేశ్, కుక్కలగణేశ్‌లకు బలమైన గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడు మృతి

నెల్లికుదురు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రాజుల కొత్తపెల్లి గ్రామంలో శనివారం జరిగింది ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం. జిలుకర ప్రసాద్ తన వ్యసాయభూమిని దున్నటానికి ట్రాక్టర్‌పై తన చిన్నకుమారుడు వరుణ్ (7) పెద్ద కుమారుడు సందీప్, కూతురు సౌమ్యలను ట్రాక్టర్‌పై ఎక్కించికొని దున్నటానికి వెళ్లాడు. దున్నుతున్న క్రమంలో చిన్నకుమారుడు వరుణ్ కింద పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. వరణ్‌తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించినటు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

గార్ల జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గార్ల మండల కేంద్రంలో శనివారం జరిగింది. గార్ల ఎస్సై రియాజ్ పాష తెలిపిన వివరాల ప్రకారం. గార్ల పట్టణంలోని కొలిమి కోట్టం బజార్ చెందిన రుద్ర ప్రశాంత్ (21) స్థానికంగా ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో గతంలో ప్రశాంత్ తండ్రి చనిపోగా తల్లి కొడుకుతో లేకపోగా.. అన్న విశాఖపట్నంలో ఉండంతో ప్రశాంత్ ఒంటరిగా ఉంటు ఆటో నడుపుకుంటూ ఒంటరి జీవితం గడుపుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 18 తేదీన ఇంట్లో గడ్డిమందు తాగడంలో దీన్ని స్నేహితులు గమనించి, ప్రశాంత్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స జరిపించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంటనే వరంగల్ ఎంజీఎంకి ఆస్పత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు సోదరుడు రుద్ర జశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్త చేస్తునట్లు ఎస్సై రియాజ్ పాష తెలిపారు.

తెరుచుకోని 'మోడల్' హాస్టల్

● దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తున్న బాలికలు ● వసతి గృహం సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థినులు

కేసముద్రం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నాణ్యమైన ఆంగ్లమాధ్యమ విద్యనందిస్తూ దూర ప్రాంతాల్లోని బాలికలకు వసతిగృహం సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ హాస్టల్ ఈ విద్యాసంవత్సరం నేటికీ తెరుచుకోలేదు. విద్యాసంవత్సరం ప్రారంభించి 16 రోజులు కావస్తున్నప్పటికీ ఈ హాస్టల్‌ను తెరిపించి విద్యార్థినులకు రెసిడెన్షియల్ సౌకర్యం అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మోడల్ స్కూల్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదివే 100 మంది స్థానికేతర విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించాల్సిఉంటుంది. పాఠశాలలో ఈ ఏడాది 9 నుంచి ఇంటర్ సెకండీయర్ విద్యార్థినులు 150 మంది వరకు ఉన్నారు. ఇందులో 5 నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని ఇంటి నుంచి పాఠశాలకు వస్తున్నవారు ఉన్నారు. ముగ్గురు విద్యార్థినులు 20 కిలోమీటర్ల దూరంలోని ఆలేరు సమీపంలోని వావిలాల నుంచి నిత్యం వ్యయప్రయాసాలకోర్చి పాఠశాలకు వస్తుండడం గమనార్హం. పాఠశాల అనుబంధ హాస్టల్‌ను ఎప్పుడు తెరుస్తారని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ హాస్టల్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రెండేళ్ల క్రితం 95 మంది విద్యార్థినులుండగా గత ఏడాది 35 మందే ఉన్నారు. ప్రభుత్వం ఈ హాస్టల్ నిర్వహణను కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్‌కు అప్పగించారు. ఈసారి 16 రోజులవుతున్నప్పటికీ హాస్టల్‌ను ప్రారంభించకపోవడంతో అధికారుల తీరుపై విద్యార్థినుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై హాస్టల్ నిర్వాహకులు కేజీబీవీ ప్రత్యేకాధికారి సోమలక్ష్మిని వివరణ కోరగా విద్యార్థినులే హాస్టల్‌కు రావడంలేదని, సోమవారం నుంచి ప్రారంభించేందుకు హాస్టల్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే హాస్టల్‌ను ప్రారంభించి విద్యార్థినులకు వసతిసౌకర్యాన్ని కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రారంభం కాని కల్వల మోడల్ స్కూల్ అనుబంధ హాస్టల్

కర్కోటక కొడుకు

● నిద్రిస్తున్న తల్లిపై పెట్రోల్ పోసి నిప్పు
● బ్యాంకులోని డబ్బులు ఇవ్వడం లేదని ఆగ్రహం
● గాయాలతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి
● సంగెం మండలం కుంటపల్లిలో అమానవీయ ఘటన



సంగెం, జూన్28 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో ఉన్న డబ్బులు విడిపించి ఇవ్వడం లేదని కన్నతల్లిపై కక్షగట్టిన కొడుకు ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆమెను 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ఈ సంఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలోని కుంటపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

సంగెం పోలీసులు, గ్రామస్థులు అందించిన సమాచారం ప్రకారం... కుంటపల్లికి చెందిన ముత్తినేని సాంబయ్య-వినోద దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కుమారుడు సతీష్ కొన్ని నెలలుగా జిల్లాలోని గీసుగొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణంలో సాంబయ్యకు చెందిన వ్యవసాయ భూమి పోయింది. దీంతో ప్రభుత్వం భూమికి సంబంధించిన డబ్బులు అందించింది. అందులో కొంత డబ్బుతో ఖానాపురం మండలం ధర్మారావుపేటలో వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. మిగిలిన రూ.5 లక్షలను సంగెం మండల కేంద్రంలోని బ్యాంకులో డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీతో జీవనం సాగిస్తున్నారు.

అయితే తన అవసరాల రీత్యా బ్యాంకులోని డబ్బు విడిపించి ఇవ్వమని తల్లి వినోద, తండ్రి సాంబయ్యను సతీష్ కొన్ని రోజులుగా కోరుతున్నాడు. పలు మార్లు బలవంతం చేయడంతో పాటు దాడులు చేశాడు. దీంతో గ్రామపెద్దలు సతీశ్‌ను తల్లిదండ్రులకు దూరంగా ఉండాలని చెప్పడంతో గత ఏప్రిల్ 1 నుంచి గంగదేవిపల్లిలో ఉంటున్నాడు. బ్యాంకులోని డబ్బును విడిపించి ఇవ్వాలని చెప్పినప్పటికీ తల్లిదండ్రులు వినకపోవడంతో శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటలకు సంగెంలో పెట్రోల్ బంక్‌లో బాటిల్‌లో పెట్రోల్ పోయించుకొని కుంటపల్లిలోని తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి వచ్చాడు.

గేటును తొలగించుకొని వచ్చి ఆరుబయట నిద్రిస్తున్న తల్లిపై పెట్రోల్ పోశాడు. దీంతో ఆమె ఉలిక్కి పడి లేచే సరికి నిప్పంటించాడు. పక్కనే నిద్రిస్తున్న తండ్రి లేచి కేకలు వేయయడంతో సతీష్ పారిపోయాడు. మంటలను చూసిన స్థానికులు వెంటనే 100కు డయల్ చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గాయాలతో వినోద విలపిస్తుండగా 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వినోదకు 90 శాతం మేర కాలిన గాయాలయ్యాయనిధ్రువీకరించారు. సతీష్‌పై సాంబయ్య సంగెం ఎస్సై ఎల్.నరేష్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సతీష్ జులాయిగా తిరిగేవాడని గ్రామస్థులు తెలిపారు.

ఇంటికి పిలిపించి.. మద్యం తాగించి...

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగి గడ్డం ప్రవీణ్‌కుమార్‌కు ఆరునెలల క్రితం రూ.50 వేలు అప్పుగా ఇచ్చాడు. అయితే వడ్డీకి ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని ఒత్తిడి పెంచడంతో ప్రవీణ్‌కుమార్ కక్ష పెంచుకున్నాడు. మద్యం తాగుతామని నవీన్‌కుమార్‌ను శుక్రవారం తన ఇంటికి పిలిపించి ఫుల్లుగా మద్యం తాగించాడు. మద్యం మత్తులో ఉన్న నవీన్‌కుమార్‌పై కత్తితో తలపై, మెడపై దాడి చేశాడు. దీంతో నవీన్‌కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం నవీన్‌కుమార్ మెడలో ఉన్న 55 గ్రాముల బంగారు పులిగోరు లాకెట్, 25 గ్రాముల బంగారు రుద్రాక్షమాల, 40 గ్రాముల 8 చేతి ఉంగరాలు, 35 గ్రాముల చేతి కడియం, వస్తువులను తీసుకుని ప్రవీణ్‌కుమార్ పాయిపోయాడు. బంగారం మొత్తం విలువ రూ.6 లక్షలు ఉంటుందని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి విచారించి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శనివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య త్రిపురాది మాధవి ఫిర్యాదు మేరకు కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాగా, మొదటినుంచి గడ్డం ప్రవీణ్‌కుమార్‌ది నేరప్రవృత్తే. ఓ మహిళా రైల్వే ఉద్యోగితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో అతడి భార్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. బాలుడు అమ్మమ్మ వద్ద ఉంటున్నట్లు స్థానికులు చెప్పారు. పలు నేరాలతో సంబంధం ఉన్న ప్రవీణ్ కుమార్ పలు కేసుల్లో సస్పెండై తిరిగి ఉద్యోగంలో చేరాడు. శుక్రవారం రాత్రి నవీన్‌కుమార్‌ను ప్రవీణ్‌కుమార్ ఒక్కడే హత్య చేశాడా... ఎవరైనా సహకరించారా.. అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

రైతులకు నేరుగా ఎరువులు అందించాలి

రాష్ట్ర రైతు సంఘం మాజీ అధ్యక్షుడువిశ్వేశ్వరరావు

తొర్రూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రైతులకు నేరుగా ఎరువులు, దుక్కి మందులు అందించే సదుపాయం కలిగించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మాజీ అధ్యక్షుడు తమ్మెర విశ్వేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రోజులు మారుతున్న నేపథ్యంలో సహకార సంఘాలు వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు కొత్తగా గ్రామాలతో పాటు పట్టణాల్లో కౌంటర్‌లు ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నారని, ట్రాన్స్‌పోర్టు ఖరీదు తీసుకుని రైతుల ఇళ్ల ముందుకు ఎరువులు, ఇతర మందులను అందించాలన్నారు. రైతులకు ఇంటి ముందుకే క్రిమి సంహారక మందులు అందించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఈ సౌకర్యాన్ని సహకార సంఘాలు ప్రారంభిస్తే రైతులకు చేదోడు వాదోడుగా ఉంటాయన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్‌సీఆర్టీ హంసావత్ శ్రీనివాస్

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌సీఆర్టీ హంసావత్ శ్రీనివాస్ అన్నారు. గూడూరు మండలం ఊట్ల, దామెరవంచ, పొనుగోడు గ్రామాలలో శనివారం దర్తీఅబా సదస్సులను నిర్వహించారు. మట్టివాడ హెచ్ఎం సారంగపాణి, గ్రామ కార్యదర్శులు రేఖ విజయ, దారం శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'కృష్ణ కార్మికవర్గం పక్షపాతి'

గూడూరు, జూన్28(ఆంధ్రజ్యోతి) : కార్మికవర్గ పక్షపాతిగా సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గంపుడి వెంకటకృష్ణ పాటుపడ్డారని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లిరవి తెలిపారు. గూడూరులో డీవి.కృష్ణ వర్ధంతిని శనివారం నిర్వహించారు. రైతుసంఘం జిల్లా నాయకులు వీరెల్లి కొమురయ్య, పెదకాసు కొమురమల్లు, బ్రహ్మోజు బ్రహ్మచారి, జితేందర్, ఎర్రబెల్లి రాజు, వీరన్న పాల్గొన్నారు.

7న దళిత వాడల్లో జెండా పండుగ

నెహ్రూసెంటర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి 30 సంవత్సరాలుపూర్తి చేసుకున్న సందర్భంగా జూలై 7న దళితవాడల్లో జెండా పండుగ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య మాదిగ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీహెచ్.రాధ, పులి శ్రీను, కుక్కలసుధ, భాస్కర్, ఎల్లయ్య, సాలమ్మ, సంధ్య, బాలమ్మ, బాబు, సతీష్, అంజయ్య, రాధ, మోధి, బాలకృష్ణ, దేవి, ఉపేందర్ పాల్గొన్నారు.

కళాశాలకు 8 వైట్‌బోర్డులు బహూకరణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఖమ్మంపాటి విజయ్ రూ.20 వేల విలువగల వైట్ బోర్డులను స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు బహుకరించారు. స్థానిక బాలికల కళాశాలలో సదరు బోర్డులను శనివారం ప్రిన్సిపాల్ పి. సదానందంకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. గతంలో కళాశాల అభివృద్ధికి రూ.40 వేలు వెచ్చించి, ప్రస్తుతం 8 వైట్ బోర్డులను అందించిన విజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లెక్చరర్లు కుమార్, సాదిక్‌అలీ, పర్వీన్‌బేగం, స్వాతి, చొప్పరి శ్రీనివాస్, రవి, కిరణ్, శ్రీను, స్వాతిరాణి, సరిత, నవీన్, కిరణ్‌కుమార్, లక్ష్మి, కళావతి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంపీ పరామర్శ

ఇనుగుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండల కేంద్రంలో ఇటీవలె వేర్వేరు కుటుంబాల్లో మృతి చెందిన అనుమాండ్ల సోమిరెడ్డి, సట్ల అంజలి, నెమలికండ్ల పుల్లమ్మ, చాగంటి లక్ష్మి కుటుంబాలను శనివారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద పూలు చల్లి నివాళులర్పించి, వారి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.